

# ప్రశ్న

శ్రీపి రామమోహనశాస్త్రి

గుమ్మంలో కాలుపెట్టగానే సుమిత్ర గొంతు గంభీరంగా పలికింది ఆహ్వానిస్తూ. నెమ్మదిగా విశాలమైన హాల్లోకి నడిచేను.

"రండి కృష్ణమూర్తిగారూ! అప్పుడే అరగంటనుంచీ మీ కోసం ఎదురు చూస్తున్నాను!" అన్నది సుమిత్ర, చేతిలో వున్న ఇంగ్లీషు నవలని పక్కన పడేస్తూ, సోఫాలోంచి లేచినిలబడి.

వాచీ చూసుకున్నాను. సాయంత్రం ఆరున్నర దాటుతోంది..

"అయామ్ సారీ! ముందుగానే రావాలని చాలా ప్రయత్నించేను సుమిత్రగారూ! వెధవది ఆఫీసులో పని ఓ పట్టాన తెమిలిందికాదు! ఇంటికి వెళ్లి ఆదరా బాదరా స్నానం చేసి బట్టలు మార్చుకుని బయల్దేరేసరికి ఈ వేళయిపోయింది!" అన్నాను ఆలస్యానికి నొచ్చుకుంటూ.

సుమిత్ర నవ్వింది. ఆ నవ్వులో హుషారులేదు. నవ్వలేక నవ్వుతున్నట్లు తోచింది.

"ఆరుద్రగారన్నట్లు 'నీవెక్కిన రైలుబండి ఎపుడూ ఓ జీవితకాలం లేటు!' నేనిప్పుడున్న స్థితిలో అయిదు నిముషాలు కూడా చాలా దుర్భరంగానే అనిపిస్తోంది కృష్ణా!" అన్నది సుమిత్ర, కూర్చోమని నాకు తన ఎదురుగా వున్న పేముకుర్చీ చూపిస్తూ.

ఆమె పిలుపు చెవినపడి ఉలిక్కిపడ్డాను. ఒక్క క్షణం ఆమెవైపు కళ్లార్పకుండా చూసేను. కూర్చున్నాను.

సుమిత్ర చిరునవ్వు నవ్వింది.

"కంగారుపడకు కృష్ణా! కాలేజీ వదిలి పదేళ్లయిపోయింది. ఏడాది నుంచి మనం ఈ వూళ్లో పరిచయస్థులుగా వుంటున్నాం. ఉద్యోగాలు కల్పించిన హోదాల అంతరాలనిబట్టి అర్థంలేని మర్యాదలు పాటిస్తూ ఓ రకంగా ఆత్మవంచనే చేసుకుంటూ వస్తున్నాం. అవునా? అది

ఆత్మవంచన అని తెలిసినా లోకానికో, మనుషుల తత్వాలకో జడిసి సరిపెట్టుకోవడం నిజం! కాని ఇప్పుడు ఆ రాజీధోరణి అనవసరం అనిపించి ఆ గీత చెరిపేసేను. ఇప్పుడు మళ్లీ మనం కాస్సేపు స్నేహితులుగా మనసులు విప్పి మాట్లాడుకుందాం!'' అన్నది.

తల పంకించేను.

నేను కొన్ని క్షణాలు ఏం చెప్పాలో తోచక మౌనంగా సుమిత్రవంకచూస్తూ వుండిపోయేను.

''నా ధోరణి వింతగా వున్నట్టుంది నీకు?'' అన్నది సుమిత్ర.

''వింతకాదు సుమిత్రా! కాని యిప్పుడిలా మాట్లాడాల్సినంత అవసరం ఏమొచ్చిందో అర్థం కావడంలేదు'' అన్నాను. ఏదో అంటున్నానేగాని నా మనసులో ఎన్నో రకాల ఆలోచనలు. క్రమపద్ధతిలో మాత్రం సాగటంలేదు. అంతా గజిబిజి గందరగోళం.

సుమిత్ర, ఆమె భర్త రామ్మూర్తి, నేనూ ఒకే కాలేజీలో డిగ్రీదాకా కలిసే చదువుకున్నాం. కాలేజీ జీవితం సహజంగానే మమ్మల్ని స్నేహితుల్ని చేసింది. ఆ రోజులు అంతే మరి. చదువుకి ఆస్తిపాస్తుల అంతరాలు, కులమతాల తారతమ్యాలూ ఉండవు, మనుషులకి తప్ప. తెలివితేటల్నిబట్టే డిగ్రీలు వరిస్తాయి. (కొనుక్కుంటే ఏమో మరి!) కాకపోతే తెలివితేటల స్థాయినిబట్టి ర్యాంకులు. నేను తెలివిగల వాణ్ణన్న నమ్మకం నాకెప్పుడూ వుండేదికాదు. ఒకవేళ ఉన్నా నా ఆర్థిక పరిస్థితులు వాటిని సద్వినియోగం చేసుకునేందుకు తగ్గిన శ్రమకి దోహదం చెయ్యలేక పోవడాన, చదువులో నా ప్రతిమెట్టూ థర్డ్‌క్లాసు కంపార్ట్‌మెంటే అయింది. అదృష్ట దురదృష్టాలపై, ఇప్పుడు నాకు నమ్మకం లేకపోయినా, అప్పట్లో మాత్రం నా 'అదృష్టం' యింతే అనుకుని సంతృప్తిపడ్డాను. చెయ్యగలిగిందేం లేదు మరి.

ఆ రోజుల్లో సుమిత్ర అంటే నాకు వల్లమాలిన ప్రేమ వుండేది. ఎన్నడూ పైకి వ్యక్తం చెయ్యలేకపోయినా ఆమెని ఓ భక్తుడికన్న ఎక్కువగా ఆరాధించేవాణ్ణి. ఆమె ప్రతి కదలికలోనూ అపూర్వమైన సౌందర్యం, లావణ్యం దర్శించేవాణ్ణి. నిలువెల్లా పులకరించి పోతూండేవాణ్ణి. ఆమె నా సొంతమైతే లభించే మధురాతి మధురమైన జీవితాన్ని వూహించుకుని మురిసిపోయేవాణ్ణి. బహుశ ఆ వయసుకుండే సహజమైన బలహీనత అయివుండొచ్చు. కాని నాకు అదొక పగటికల అని తెలుసు. నాదొక మధ్య తరగతి జీవితం. నాన్న ఒక్కడి సంపాదన మీద బతికే ఆరుగురి జీవుల కుటుంబం. తొందరగా నేనొక డిగ్రీ సంపాదించి, ఉద్యోగస్తుణ్ణయితే తనకి చేయూతగా వుంటానని అతి కష్టం మీద చదివిస్తున్న నాన్న మనోవేదనని తల్చుకున్నప్పుడల్లా నా మనస్సు బరువెక్కేది. అందుకే కోరికలు ఎన్నివున్నా వాటన్నింటినీ హృదయంలో మారుమూల చీకటికోణాల్లోనే అణిచివేసుకుని, చదువు కొనసాగించేవాణ్ణి.


కాలేజీ జీవితం ముగిసింది. డిగ్రీ చేతికి వచ్చేసింది. ఆ తరవాత నా కథ మామూలే. కాలేజీలో చదువుతూనే సంపాదించుకున్న టైపూ, షార్ట్‌హాండ్ సర్టిఫికెట్లతో పాటు, పట్టాకూడా చేర్చి, కనిపించిన చోటికల్లా అప్లికేషన్లు పంపడం, ఇంటర్వ్యూలకని పిలుపొచ్చిన చోటికల్లా కాళ్లకి బలపాలు కట్టుకు తిరగడం, ఆశా నిరాశల మధ్య ఊగులాడ్డం, నెక్స్‌టైం బెటర్‌లక్ అని సరిపెట్టుకుని మళ్లీ మళ్లీ ప్రయత్నాలు సాగించడం ఓ ఏడాది సాగేక పురుషలక్షణం అబ్బింది నాకు. ఉద్యోగంలో చేరిన రోజున నాన్న ముఖంలో వెలిగిన ఆనందం యింతా అంతాకాదు. ఏనుగెక్కినట్టుందాయనకి. నిజమే మరి! ఆయనకి నిజమైన చేయూత దొరికింది. మూడేళ్ళు తిరిగేసరికి ఇద్దరి అక్కల పెళ్లిళ్లూ చేసేశాడాయన. అందుకోసం ఆయన చేసిన అప్పులు తీర్చే బాధ్యతని నా భుజాలమీద వేసుకున్నాను, ఆనందంగా. ఆ తరవాత నా పెళ్లి ప్రయత్నాలు ప్రారంభించ బోయినప్పుడు నేను గట్టిగా ప్రతిఘటించేను. చెల్లెలి పెళ్లికూడా అయిపోయేదాకా ఆ వూసెత్తద్దన్నాను. ఆయన ఎంతగా ఒత్తిడిపెట్టినా నేను మనసు మార్చుకోలేదు. మరో రెండేళ్లకి ఆ బాధ్యత కూడా తీర్చేసుకుని నాన్న రిటైరై పోయేరు. పెన్షను పుచ్చుకుంటూ అమ్మా, తనూ నిశ్చింతగా కాలక్షేపం చేసేస్తున్నారు. వాళ్ల బెంగంతా నేనో యింటివాణ్ణి కాలేదని! అప్పటికే నాకు ముప్పై రెండు దాటేయి. ఇంకా ఆలస్యమైతే పిల్లనివ్వడానికెవరూ రారేమోనని వాళ్ల అనుమానం. వాళ్ల ఆలోచనలేవిటో నాకు తెలుసు. కాని నాకసలు పెళ్లిధ్యాస కలగలేదు. చేసుకోవాలని కూడా లేదు.

అందుకు కారణం సుమిత్ర రామ్మూర్తిని పెళ్లి చేసుకోవటం! అదీ ప్రేమించి మరీ! ఆ విషయం విన్న తర్వాత నేను విపరీతంగా బాధపడ్డాను. నా గుండె పగిలి పోయినట్లనిపించింది. జీవిత సర్వస్వాన్నీ పోగొట్టుకున్నట్టు లోలోపల కుళ్లి కుళ్లి ఏడ్చేను. నా కుటుంబ పరిస్థితులు, నా ఆర్థిక స్థితి, తప్పించుకుందుకు వీల్లేని నా బాధ్యతలు, ఏనాడూ ఆమెకి నా మనసులో వున్న అభిప్రాయాన్ని చెప్పుకోనివ్వలేదు. చెప్పి వుంటే ఇలా జరిగి వుండేది కాదేమో! పూర్తిగా అలాగనీ నిర్ధారించుకోలేక పోయాను. సుమిత్రా, రామ్మూర్తీ ఆస్తిపరులు! వాళ్లతో నేనేరకంగానూ సరితూగను. ఒకవేళ ఆమెతో అని వుంటే.... మొహం వాచేలా చీవాట్లు పెట్టేదేమో కూడా!

ఏది ఏమైనా సుమిత్ర పరాయి సొత్తయి పోయింది. నాలో ఒకానొక భయంకరమైన శూన్యం ఆవరించేసింది. పెళ్లీ, పిల్లలూ, సంసారం.... వీటిమీద నాకో రకమైన విరక్తి కలిగింది. అందుకే ఒంటరిగానే నేటిదాకా గడుపుకొచ్చేశాను.

నేను పని చేస్తున్న పబ్లిక్ లిమిటెడ్ కంపెనీలో, సుమిత్ర పర్సనల్ ఆఫీసర్. నేను మాత్రం యింకా చాలా మందిలాగే సీనియర్ క్లర్క్‌గానే ఆమె సెక్షన్‌లో నే పని చేస్తున్నాను. ఆమె అదృష్టం కొద్దీ.... లేదా ఆమె తెలివి తేటల కొద్దీ నాకన్నా చాలా ముందుగా అక్కడ చేరడంతో ఆ స్థాయికి వెళ్లింది. నేను చాలా చోట్ల టెంపరరీ జాబులు చేసి చేసి ఆలస్యంగా చేరడంతో.... ఇలా వుండిపోయాను. పైగా ఆమె పట్టుదలగా క్వాలిఫికేషన్స్ పెంచుకుంది. నేను అలాంటి మంచి పన్లకి దిగలేక పోయేను ఓపికలేక.

నేటిదాకా ఆమె నన్ను తనింటి కెప్పుడూ రమ్మని పిలవ లేదు. తన సంసారం గురించీ, పిల్లా జెల్లా వివరాలూ నాకు చెప్పలేదు. నేనడగనూ లేదు. పాత స్నేహాన్ని మననం చేసుకుని అవసరం లేని విషయాలు ఆఫీసర్ దగ్గర ప్రస్తావించడం 'అవిధేయత' అవుతుందేమోనన్న భయం నాలో ఏమూలో కదులుతూండటం ముఖ్య కారణం. మనుష లెప్పుడూ ఒక్కలా వుండరు. కాలగతిలో స్వభావాల్లో ఎన్నో మార్పులు రావడానికి ఆస్కారం వుంటుందని నా నమ్మకం.



"కృష్ణా! ఈ లోకంలో ఉన్నట్టు లేవు!" అన్నది సుమిత్ర నన్ను ఆలోచనల్లోంచి బైట పడేస్తూ.

నవ్వేను. జేబులోంచి సిగరెట్టు పెట్టి, అగ్గిపెట్టి బైటికి తీసేను. ఓ సారి ఆమె వైపు చూసేను.

[illegible]

ఓ సిగరెట్టు ముట్టించేను. గట్టిగా పొగ దమ్ములాగి గాలిలోకి వదిలేను. అంతలో వంటావిడ ట్రేతో ఉప్మా ప్లేట్లూ, నీళ్ల గ్లాసులూ తెచ్చి టీపాయ్ మీదుంచింది.

"తీసుకో కృష్ణా!" అన్నది సుమిత్ర ఓ ప్లేటు నాకు అందిస్తూ. అందుకున్నాను.

"ఇప్పుడీ మర్యాదలన్నీ దేనికి?" అన్నాను.

"నా తృప్తి కోసం! సాధారణంగా నా యింటికి గెస్టు లెవరూ రారు. నేను పిలిస్తేగా రావటానికి? ఎందుకో నాకీ ఒంటరితనమే హాయిగా వున్నట్లని పిస్తుంది. అఫ్‌కోర్స్! నువ్వు నా స్నేహితుడివి! కొన్నేళ్లపాటు కాలేజీలో కలిసి చదువుకున్నాం! చాలా సంవత్సరాల తరవాత కలిసేం కదా!" అన్నది సుమిత్ర.

"సుమిత్రా! నిన్నో ప్రశ్న అడగాలనుంది!" అన్నాను. నా గొంతు కొంచెం కటువుగా ధ్వనించే వుంటుంది. సుమిత్ర తెల్లబోయి చూసింది.

"నువ్వు ఉదయపూర్ నుంచి ట్రాన్స్‌ఫర్ అయి యిక్కడ కొచ్చి ఏడాది దాటిపోయింది. ఇంతకాలం నేను గుర్తు రాలేదా?" అని ప్రశ్నించేను.

"అదే ప్రశ్న నేను నిన్నడిగితే నీ జవాబేమిటి?" అని సూటిగా అడిగింది సుమిత్ర. ఆమె పెదవుల మీద చిరునవ్వు మెరుస్తోంది.

క్షణం ఆలోచించేను.

"కొత్తగా గుర్తు చేసుకుందుకు అసలు నిన్ను మర్చిపోవడం అంటూ జరిగితే గదా! పోతే కనీసం ఆఫీసు బైట అన్నా కొద్దిపాటి సన్నిహితత్వం చూపించలేదెందుకని అనుమానం కలగవచ్చు. ఆఫీసులోనూ, బైటా ఈ మనుషుల తత్వాలు నాకు బాగా తెలుసు. లేనివి కల్పించి ప్రచారం చేస్తూ ఆనందిస్తారు. ప్రశాంతంగా సాగిపోతున్న జీవితాల్లో కల్లోలం సృష్టించుకుని బాధపడ్డం దేనికని, మనం క్లాస్‌మేట్సమన్న విషయం కూడా నేనెక్కడా అనలేదు" అన్నాను.

"థాంక్యూ! ఇక నేను నీ ప్రశ్నకి సమాధానం చెప్పక్కర్లేదు. అది నీ మాటల్లోనే వుంది. కాని ఓ చిన్న విషయం మాత్రం చెప్పాలి. అది చెప్పుకోడానికి ప్రస్తుతం నాకీప్రపంచంలో నీకన్నా ఇంకెవరూ లేరు కృష్ణా! ఏకాకిని!" అన్నది సుమిత్ర. ఆమె కంఠం గద్గదికమై పోయింది. ఆమె విశాలమైన కళ్లనిండా నీళ్లు. చెక్కిళ్ల మీదికి జారుతున్నై.

మౌనంగా చూస్తున్నాను. నాలో ఎన్నో ప్రశ్నలు!

సుమిత్ర ఇలా మాట్లాడుతుం దేమిటి? ఎవరూ లేకపోవడమేం? ప్రేమించి పెళ్లి చేసుకున్న భర్త రామ్మూర్తి ఉండగా ఏకాకి ఎలా అవుతుంది? ఆస్తి పాస్తులున్నాయి. మంచి ఉద్యోగం వుంది. హోదా వుంది. ఏ బాధ్యతలూ, బరువులూ లేని వడ్డించిన

# ప్రశ్న

విస్తరి లాంటి జీవితం! ఇంకేం కావాలి? ఎందుకామె బాధపడాలి?

"అమ్మా! టిఫిన్ చల్లారి పోతోంది. తినండమ్మా! కాఫీ తెస్తాను!" అన్నది వంటావిడ వచ్చి.

ఏదో తిన్నాం అనిపించేం. కాఫీలు కూడా తాగేసేం. వంటావిడ కాఫీ ప్లేట్లూ, కప్పులూ పట్టుకు పోయింది.

మరో సిగరెట్టు ముట్టించి గట్టిగా పొగ పీల్చి వదిలేను.

"నా సంగతికేంగాని, ఇప్పుడు చెప్పు కృష్ణా! నీ గురించి", అన్నది సుమిత్ర మామూలుగా.

"చెప్పడానికేం లేదు సుమిత్రా! మా నాన్న నా మీదుంచిన బాధ్యతల్నించీ విముక్తుణ్ణయ్యాను. మా అక్కయ్యలిద్దరి పెళ్లిళ్లూ, చెల్లి పెళ్లీ చేసేం. హాయిగా వాళ్ల సంసారాలు వాళ్లు చేసుకుంటున్నారు. నాన్న రిటైరైపోయేరు. పెన్షన్ వస్తోంది. అమ్మా, ఆయనా మా వూళ్లోనే కులాసాగా వున్నారు. ఇక నేను! స్వతం భోజనం, మఠం నిద్రగాడిలాగా గడిపేస్తున్నాను. ఉద్యోగం, జీతం కలిపి నా జీవితం. రోజులు గడిచి పోతున్నాయి ఒకదాని వెంట ఒకటి! ఎవరో కవి అన్నట్టు 'దినములు పరస్పర ప్రతిధ్వనులు కాగా!'" అన్నాను.

## మమతల పొత్తు

అందరం కలిశాం
అందరం ఆడాం
కోలాటం
కోలాహలం
మనభాషలు వేరు
మనఘోషలు వేరు.
కట్టు బొట్టు వేరయినా
కట్టుబాటు ఒకటే
హృదయాల స్పందన ఒకటే!
మరిచిపోదాం
అరమరికలు లేకుండా
కలిసిపోదాం
కడవరకు
దేశం ఏ ఒక్కడి సొత్తుకాదు
నీది, నాది మనందరిదీ
అనుభవిద్దాం ఆ సమగ్రతాసొత్తుని
కొనసాగిద్దాం మనమధ్య
మమతల పొత్తుని!

-దిట్టకవి కృష్ణబాబు

"అంతేనా? ఇంకేం లేదా?" అడిగింది సుమిత్ర ఆశ్చర్యంగా.

లేదన్నట్టు తల అడ్డంగా వూపేను.

"ఈ ఒంటరితనాన్ని కావాలని ఎన్నుకున్నావా? లేక కారణం ఏదన్నా వుందా? యిది పూర్తిగా వ్యక్తిగతమైన ప్రశ్న అనుకో! అభ్యంతరం లేకపోతేనే చెప్పు!" అన్నది సుమిత్ర. ఆమె కంఠం స్వల్పంగా కంపిస్తోంది. గమనించేను. ఆమె కేదో సందేహం వచ్చిందని అర్థమైంది.

"చెప్పాలనే వుంది సుమిత్రా! కాని ఇప్పుడు ఇన్నేళ్ళ తరవాత చెప్పి ఏం ప్రయోజనం? అందువల్ల బాధే మిగుల్తుంది. పెంచుకున్న ఆశలూ, ఆశించిన అనుభూతులూ, మురిపించిన మధురస్వప్నాలూ.... అన్నీ ఒకేసారి అంతరించి పోయేసరికి మనసు నిండా ఒక భయంకరమైన శూన్యం ఏర్పడిపోయింది ఏనాడో! అందులోంచి బయట పడటం నా వల్ల కాలేదు! అందుకే ఇలా బతికేయడం అలవాటు చేసుకున్నాను.ఇందులో ఎవరి తప్పూ లేదు. ఏదన్నా వుంటే అది నా బలహీనతే అయి వుంటుంది!" అన్నాను సాధ్యమైనంత గాంభీర్యాన్ని గొంతులో నింపుకుని.

నిట్టూర్చింది సుమిత్ర భారంగా. వాచీ చూసుకుంది. రాత్రి ఎనిమిది గంటలు దాటి పోయింది.

"వస్తాను. సుమిత్రా! చాలా పొద్దు పోయింది!" అన్నాను.

"అర్జంటు పనేమైనా వుందా కృష్ణా?" అడిగిందామె.

"అలాంటిదేం లేదు. ఏం?" అన్నాను.

సుమిత్ర లేచి నిలబడింది.

"నీకో విచిత్రమైన వ్యక్తిని పరిచయం చేస్తాను కృష్ణా! ఆ పరిచయం అయింతర్వాత నా జీవితం గురించి నువ్వు అడగని, అడగలేని వివరాలు తెలుసుకుంటావు! నా కార్లో వెడదాం! వస్తావు, గదూ?" అనడిగిందామె.

"అలాగే!" అన్నాను.

సుమిత్ర వంట గది వైపు చూస్తూ "రంగమ్మ గారూ!" అని పిల్చింది. వంటావిడ గబ-గబ వచ్చింది.

"ఏవిఁటమ్మా?" అన్నది.

"బైటికి వెడుతున్నాను. రావడం కొంచెం ఆలస్యం అవుతుందేమో! మీరు భోజనం చేసెయ్యండి. తలుపులు జాగ్రత్తగా వేసుకుని, హాల్లో పడుకోండి! నే వచ్చి పిలిస్తే మీకు వినిపించాలి గదా!" అన్నది సుమిత్ర.

"అలాగేనమ్మా!" అన్నదావిడ.

సుమిత్ర కారు నడుపుతోంది. నేనామె పక్కనే కూర్చున్నాను. సిగరెట్టు పొగ పీలుస్తూ మధ్య మధ్య ఆమె వైపు చూస్తున్నాను. ఆమె ముఖంలో గాంభీర్యం ఆమె చూపులు రోడ్డు మీదున్నా, వాటిలో ఆలోచనలెన్నో.

కారు సన్నగా శబ్దం చేస్తూ దూసుకుపోతోంది.

# కమల్ 'సాధన'



కమల్ హాసన్ టి. వి. సీరియల్‌లో కనిపించ బోతున్నాడు. అంబరీష్ సంగాల్ దర్శకత్వంలో తయారైన 'సాధన' అనే సీరియల్‌లో కమల్ మనకు కనిపిస్తాడు. దక్షిణ భారత సంగీత కళాకారులతోసహా మనదేశంలోని ప్రముఖ సంగీత కళాకారులను పరిచయం చేసే ఈ సీరియల్‌లో లతామంగేష్కర్, హేమమాలిని వంటి కళాకారులు సైతం మనకు కనిపిస్తారు. ఒక్కొక్క భాగాన్ని ఒక్కొక్క నటుడు లేక నటి సమర్పిస్తారట. ఈ సీరియల్‌కు అనురాధ హరిప్రసాద్ చౌరసియా, సతీష్ చంద్ర చిబాలు నిర్మాతలు.

"కృష్ణా! ఎదుటి మనుషుల్ని అంచనా వేసుకోవడంలో పొరపాటు జరగడం ఎవరికైనా సహజమే ఒక్కొక్కసారి. అహంకారంతోనో, అవతలి వాళ్ల ఆర్థిక పరిస్థితుల్ని బట్టో, వారి ఔన్నత్యాన్నో, వ్యక్తిత్వాన్నో గుర్తించలేకపోవడం క్షమించరాని నేరం. ఈ రకమైన నేరాలకి శిక్ష కూడా చాలా భయంకరంగానే వుంటుంది. ఇది నా అనుభవం!" అన్నదామె.

"నిజం సుమిత్రా! అనుభవం కన్న గొప్ప గురువు ఎక్కడుంటాడు?" అన్నాను. ఆమె ధోరణి నాకు అయోమయంగా అనిపిస్తోంది.

"నేనిప్పుడనుభవిస్తున్న శిక్ష నేను భరించలేకపోతున్నాను కృష్ణా! ఒక్కొక్కసారి నాకు చచ్చిపోవాలనిపిస్తుంది. కాని... నేను ఏకాకిని! ఈ ప్రపంచంలో నా కెవ్వరూ లేరు! అమ్మా నాన్నా పోనేపోయేరు. ఒకవేళ నేను నిజంగానే హఠాత్తుగా కన్నుమూస్తే ఈ విశాల ప్రపంచంలో రెండు కన్నీటి బొట్లు రాల్చే వాళ్లు కూడా వుండరు. అలా చావడం నాకు యిష్టం లేదు. అందుకే యింకా యిలా జీవచ్ఛవంలా ఒంటరిగా బతుకుతున్నాను!" అన్నది సుమిత్ర.

కట్టుకున్న భర్త రామ్మూర్తి వుండగా ఎవరూ లేని ఏకాకిని అంటుందేం? ఇంతకీ రామ్మూర్తి ఏమైనట్టు? ఈ ప్రశ్న అడగాలని నోరు తెరిచేలోగానే కారు ఓ పెంకుటింటి ముందాగింది.

"కృష్ణా! ఇదే ఆ వ్యక్తి వుండే యిల్లు!" అన్నది సుమిత్ర కారు దిగుతూ. నేనూ దిగేను.

అది నగరంలో మారుమూల పేట. వీధి లైట్లు వెలుగుతున్నాయి. ఆ వెలుగులో యింటి వైపు యధాలాపంగా చూసేను. ఓ కుటుంబం వుండటానికి వీలైన పెంకుటిల్లు. ఇంటి చుట్టూ కొద్దిపాటి ఆవరణ వుంది. చుట్టూ బార్బుడు వైరుతో వేసిన కంచె, చిన్న చెక్క గేటు. ఇద్దరం గేటు తీసుకుని ఆవరణలో ప్రవేశించేం. పూలమొక్కల వరసలు అందంగా చిరుగాలికి తలలూగిస్తూ కనిపిస్తున్నాయి.

మూసి వున్న తలుపులు తట్టింది సుమిత్ర. రెండు మూడు క్షణాల తరవాత తలుపులు తెరుచుకున్నాయి. వరండాలో లైటు వెలిగింది.

"మీరా! రండమ్మా లోపలికి!" అంటూ ఆహ్వానించిందో యువతి. తడి చేతులు [illegible] కొంగుతో తుడుచుకుంటూ.

హాలు లాంటి ముందు గదిలో ట్యూబులైటు వెలుగుతోంది. ఆ యువతి కంగారుగా రెండు కుర్చీలు తెచ్చి వేసింది.

"కూర్చోండి!" అన్నదామె.

"భోం చేశారా మీనాక్షీ! బాబేడి? చదువుకున్నాడా?" అని ప్రశ్నించింది సుమిత్ర ఆప్యాయంగా.

"ఇప్పుడే భోజనం చేసి, వంటింటి పని పూర్తి చేశానమ్మా! బాబువ్వాళ ఏడు గంటలకే పడుకున్నాడు. వాళ్ల స్కూల్లో ఆటలు పోటీలు జరిగాయట. బాగా అలిసి పోయి వచ్చేడు. పెందలాడే తిండి తిని మంచం ఎక్కేశాడు వెర్రినాగన్న!" అన్నది మీనాక్షి.

నేను మీనాక్షి వైపు పరిశీలనగా చూసేను. వయస్సు ముప్ఫై పైబడి వుంటుంది. సుమిత్ర కన్న ఒకటి రెండేళ్లు చిన్నదేమో కూడా! బాగా అందమైన మనిషి కాకపోయినా ఆమెలో ఏదో ఆకర్షణ వున్నదేమో అనిపించింది నాకు. మంచి ఒడ్డూ పొడుగ్గావుంది. ఏ కారణం చేతనో బాగా కుంగి పోయినట్లు కనిపిస్తోంది.

"అన్నట్లు మీనాక్షీ! ఈయన కృష్ణమూర్తిగారు. నాతోనే పనిచేస్తున్నారు. నేనూ, ఈయనా, రామ్మూర్తిగారూ ఒకే కాలేజీలో చదువుకున్నాం. కృష్ణా! ఈమె మీనాక్షి! ఓ మగాడి వంచనకి బలైపోయి, వాడి బిడ్డకి తల్లిగా, బిడ్డ కోసమే బతకగలుగుతోంది. భవిష్యత్తు పట్ల ఏ ఆశలూ లేకపోయినా, వాడి కోసం బతుకుతోంది. ఇందాక నువ్వన్నావే... 'దినములు పరస్పర ప్రతిధ్వనులు గాగ' అని! అలా గడిపేస్తోంది రోజులు! మగాడి దౌర్జన్యానికి, వంచనకీ దగాపడ్డ మరో అభాగిని- మీనాక్షి!" అన్నది సుమిత్ర.

"ఎందుకులెండమ్మా ఆ పాత కథలన్నీ తవ్వుకుని బాధపడటం? నా తలరాత ఇలా వున్నప్పుడు నా జీవితం ఇంకో రకంగా ఎందు కుంటుంది? భగవంతుడు నాకీ దశ కల్పించాడు! అనుభవించాలి- తప్పదు. బాబుని పసివాళ్ల నుంచీ యిలాగే సాకుతున్నాను. వాడు బాగుపడితే అంతే చాలు! వాడి భవిష్యత్తు తప్ప నాకు మరే ఆశా లేదమ్మా!" అన్నది మీనాక్షి రుద్ధ కంఠంతో.

అదీ కన్నతల్లి హృదయం! ఒక మగాడు చేసిన మోసం, అన్యాయం అన్నీ విస్మరించి, ఆఖరికి తన కడుపున పుట్టిన బిడ్డ ఆ నీచుడి ప్రతి రూపమే అన్న [illegible] కూడా [illegible]. ఆ పసివాడి [illegible] ఈ ప్రపంచం [illegible] నా భారతదేశంలోనే ఉన్నారు. అందుకే నా దేశం గొప్పది. సారే జహాఁసే అచ్ఛా! మహాకవి వాక్కు ప్రత్యక్షర సత్యం! నా కళ్లు తడి అయ్యాయి.

సుమిత్ర హ్యాండ్‌బ్యాగ్ తెరిచింది. అయిదు వందలు తీసి మీనాక్షికి అందించింది.

"అయిదు వందలెందుకమ్మా! వద్దన్నా వినకుండా ప్రతినెలా యిస్తున్నారు. మా యిద్దరి పొట్టలకి మూడు వందలు సరిపోతున్నాయమ్మా! ఎందుకిలా నన్ను ఋణగ్రస్తురాల్ని చేస్తారు? ఈ జన్మలో ఈ ఋణం తీర్చుకోలేనమ్మా!" అంటూ మీనాక్షి పైట కొంగులో మొహం దాచుకుని బావురుమంది. నేల మీద ఒక్కసారిగా కూలబడింది. సుమిత్ర కుర్చీలోంచి లేచి వెళ్లి ఆమె పక్కన కూర్చుంది నేలమీద. మీనాక్షిని రెండు చేతుల్తో చుట్టి దగ్గిరికి తీసుకుంది.

"తప్పు మీనాక్షీ! అలా ఏడవకూడదు. నేను నీకు అక్కలాంటి దాన్ని. నీకూ, నీ బిడ్డకీ ఏ లోటూ రాకుండా చూసుకునే పూచీ నాది. ధైర్యంగా వుండు. నిన్నీ స్థితికి తెచ్చిన ఆ నీచుడు సిగ్గుపడేలా చెయ్యాలిగాని ఇలా బెంబేలు పడిపోతే ప్రయోజనంలేదు". అంటూ తల నిమురుతూ ఓదార్చింది సుమిత్ర.

చాలా సేపటికి తేరుకుని, "నా సంగతి వదిలెయ్యండమ్మా! నా మనసులో ప్రతి క్షణం..." అని మీనాక్షి ఇంకేదో అనబోతుండగా సుమిత్ర అడ్డుపడింది.

"ప్రతి క్షణం బాబు భవిష్యత్తు గురించే ఆలోచించు మీనాక్షీ! ఇంకెవ్వరి గురించీ ఆలోచించకు! ఎవరి ఆలోచనలు వాళ్లకుంటాయి. ఎవరి నిర్ణయాలు వారివే! అనవసరంగా మనసు పాడు చేసుకోకు. మేం వెళ్లొస్తాం! మళ్లీ వీలు చూసుకుని వస్తాను!" అంటూ లేచింది.

"మీనాక్షిగారూ! సుమిత్ర చెప్పినట్లు చెయ్యండి! దేవతలాంటి ఆమె అండ మీకు దొరకటం నిజంగా మీ

అదృష్టం! ధైర్యంగా వుండండి!" అన్నాను.

మీనాక్షి చేతులు జోడించింది. నెమ్మదిగా బైటికి నడిచేం. కారు తిరుగు ప్రయాణం సాగిస్తోంది.

"సుమిత్రా! నిజం చెప్పు. ఎవరీ మీనాక్షి? ఆమెకీ నీకూ ఏవిఁటి సంబంధం? ప్రతినెలా నీ జీతంలో అయిదు వందలిచ్చి ఆమెని ఆమె బిడ్డనీ పోషించే బాధ్యత ఎందుకు స్వీకరించావ్? ఈ త్యాగానికి అర్థం, పరమార్థం ఏవిఁటో వివరించు!" అంటూ ఒక్కసారిగా ప్రశ్నల వర్షం కురిపించేను.

సుమిత్ర నవ్వుతోంది. కాని అది నవ్వు కాదు! పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకోడానికి చేసే వ్యర్థ ప్రయత్నం. ఆ స్థితిలో కారు తిన్నగా వెళ్ళడంలేదు.

"సుమిత్రా! కారు పక్కకి తీసి ఆపు!" అన్నాను.


చెప్పినట్లే రోడ్డు పక్కన కారాపిందామె. స్టీరింగ్ మీద తలవాల్చి వెక్కి వెక్కి ఏడవసాగింది. ఓదార్చేందుకు ప్రయత్నించలేదు నేను. వెంటనే ఆపితే ఆగే దుఃఖం కాదని అర్థమైంది నాకు.

నేనో సిగరెట్టు ముట్టించేను. గట్టిగా రెండు దమ్ములాగి గాలిలోకి వదిలేను. అయిదు నిముషాలు గడిచేయి.

"ఛ ఛ! మరీ వెర్రిగా ప్రవర్తిస్తున్నాను కృష్ణా! ఒక్కొక్కసారి కంట్రోల్ తప్పిపోతుంటాను! ఏం చెయ్యను? అది నా వీక్నెస్! ఆడదాన్ని కదా!" అన్నది.

మాట్లాళ్ళేదు నేను. వింటున్నాను.

"మీనాక్షి అనుభవిస్తున్న జీవితం, రామ్మూర్తి పదేళ్ళనాడు పెట్టిన భిక్ష! అది ఆమెకూ, నాకూ కూడా భయంకరమైన శిక్షగా పరిణమించింది. రామ్మూర్తిని ఆనాడు నేనెంతగా ప్రేమించాను! ఎంత ఆరాధించాను! అతను నన్ను కాదంటే ఆత్మహత్య చేసుకోవాలని కూడా అనుకున్నాను. అతని ప్రేమలో గుడ్డిదాన్నయి పోయేను. అతన్ని గురించి ఎవరు ఏం చెప్పినా వినిపించుకోలేని చెవిటిదాన్నయాను. ఆ నీచుడు తన నటనతో నన్ను పూర్తిగా పిచ్చిదాన్ని చేశాడు. మైకంలో పడిపోయాను. అమ్మనీ, నాన్ననీ కాదని మరీ పెళ్ళి చేసుకున్నాను. నేనెంత దగా పడిపోయేనో రెండేళ్ళు గడిచాక గాని తెలీలేదు. అదీ మీనాక్షి రెండేళ్ళ మగపిల్లాణ్ణి ఎత్తుకుని మా యింటి తలుపు తట్టి రామ్మూర్తిని నిలదీసి నప్పుడు నా కళ్ళు తెరుచుకున్నాయి. మా పెళ్ళికి రెండు నెలల ముందే అతను మీనాక్షిని రహస్యంగా గుళ్ళో పెళ్ళి చేసుకున్నాడు. ఆమెకి ముందూ వెనకా ఎవరూ లేరు. అనాథాశ్రమంలో పెరిగింది. గౌరవప్రదమైన జీవితం యిస్తున్నాడు గదాని ఆశపడి వీడి వలలో చిక్కుకుంది. ఆ రోజు గుమ్మంలోకొచ్చి న్యాయం అడుగుతున్న మీనాక్షిని నిర్దాక్షిణ్యంగా గెంటేశాడు రామ్మూర్తి. అప్పుడే మొట్టమొదటిసారిగా చూసేను అతనిలోని రాక్షసత్వాన్ని! భయంతో ఒణికిపోయేను! మీనాక్షి పట్ల జాలి కలిగినా నా సంసారం పట్ల నాకున్న స్వార్థం, రామ్మూర్తి అంటే కలిగిన భయం నన్ను ఏ సాహసమూ చెయ్యనివ్వలేదు. అప్పటికే అతను పేకాటకీ, ముండలకీ తన పేర వున్న ఆస్తంతా వెచ్చబెట్టేశాడు. ఉద్యోగం చేస్తున్న నా సంపాదనా, నా పేర వచ్చిన పొలం... మొత్తం కైంకర్యం చెయ్యాలన్న ప్రయత్నాలు ప్రారంభించేడు. నా బతుకు మీనాక్షి బతుకులా కాకూడదని జాగ్రత్తపడి, ఆఫీసర్ల్ని బతిమాలి ఉదయపూర్‌లో కొత్తగా పెట్టిన కంపెనీకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాను. అక్కడికి వెళ్ళే ముందు మీనాక్షిని వెతికి ఈ ఇంట్లో దింపేను. అక్కడున్నన్నేళ్ళూ ప్రతి నెలా ఆమెకి డబ్బు పంపుతూనే వున్నాను. ఇప్పుడూ అదే చేస్తున్నాను. తరవాత రామ్మూర్తి నన్ను చాలా రకాలుగా వేధించేవాడు. కాని నా మనస్సు రాయైపోయింది. చివరికి విడాకులకి పెట్టుకున్నాడు. అంగీకరించేను.




ఆ విధంగా మా బంధం తెగిపోయింది కృష్ణా!" అన్నది సుమిత్ర.

'ఏకాకిని, ఏకాకిని' అని ఆమె ఎందుకు పదే పదే చెప్పిందో అప్పుడర్థమైంది నాకు. ఎప్పుడూ హుషారుగా, సెలయేటి గలగల నవ్వులతో నలుగుర్నీ అలరిస్తూ, ఆకర్షిస్తూ తిరిగిన సుమిత్ర జీవితం ఇంత విషాదమయం కావడం నన్ను కదిలించేసింది. అప్రయత్నంగా ఆమె చేతిని నా చేతిలోకి తీసుకున్నాను.

"సుమిత్రా! యూ ఆర్ రియల్లీ గ్రేట్! నిజంగా నువ్వు దేవతవి. నీ జీవితం ఏమైపోయినా పట్టించుకోకుండా, మీనాక్షికీ, ఆమె బిడ్డకీ అండగా నిలిచిన నీ ఔదార్యానికి జోహార్లు సుమిత్రా! పదేళ్ళనాడు మన కాలేజీ జీవితంలో... భవిష్యత్తు ఎలా వుంటుందో తెలియక ముందే... నిన్ను ఆరాధించేను. ఎన్నెన్నో కలలు కన్నాను. నువ్వు దూరమై పోయినప్పుడు సర్వస్వం పోగొట్టుకున్న వాడిలా కుంగిపోయేను. కాని యిప్పుడు అనిపిస్తోంది సుమిత్రా! నీ వంటి మానవతా మూర్తిని ఆరాధించటంలో నేను పొరపాటు చెయ్యలేదని! నిన్ను దక్కించుకోలేని రామ్మూర్తి నిర్భాగ్యుడు. నీ హృదయంలో స్థానం సంపాదించుకున్న మీనాక్షీ, ఆమె బిడ్డా అదృష్టవంతులు!" అన్నాను, ఆవేశంతో.

సుమిత్ర కళ్ళు తుడుచుకుని, "కృష్ణా! నిన్ను ఇంటి దగ్గిర డ్రాప్ చేస్తాను!" అన్నది. తల వూపేను. కారు కదిలింది. మెరిసే కళ్ళతో నా వైపు చూస్తూ, "ఇన్నేళ్ళకైనా నీ నోట్లోంచి, నా హృదయాన్ని పులకరింపజేసే నిజం వినగలిగేను కృష్ణా!" అన్నది.

"చెప్పే అవకాశం నువ్వు యివ్వాలేగాని ఎన్ని జన్మలెత్తినా ఆ మాట చెప్తూనే వుంటాను సుమిత్రా! నా కంత అదృష్టం కలుగుతుందా అన్నదే ప్రశ్న!" అన్నాను వణికే గొంతుతో.

పది నిముషాల్లో నా అద్దె యింటి ముందు కారాగింది.

"నా యింట్లో కాలు పెట్టవా సుమిత్రా?" అన్నాను.

"హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నావా?" అడిగిందామె.

"హృదయం కోసి చూపించాలా?"

"ఇంత జరిగేక ఇంకా నా కక్కడ చోటుంటుందా?"

అక్కడ ఆవరించుకున్న శూన్యంలోంచి నీ పేరే ప్రతిధ్వనిస్తూ వుంటుంది. నువ్వే నిండి వుంటావు సుమిత్రా! నమ్మకం లేదా?"

సుమిత్ర స్టీరింగ్ ముందు నుంచి నాకు దగ్గరగా జరిగింది. ఒక్కసారిగా నా గుండెల మీద వాలింది. ఈ అపూర్వ అనుభూతి కోసం, ఈ పెన్నిధిని దక్కించుకోడం కోసం ఎంత కాలం నిరీక్షించేను? మానవుడికి భగవంతుడు పెట్టే పరీక్ష యిదేనా? ఈ పరీక్షలో నేను నెగ్గేనా? సుమిత్ర నెగ్గిందా? ఇది జవాబు లేని ప్రశ్నగా నాలో మిగిలిపోయింది.